ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని విశ్వ ప్రేయర్ హాల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చర్చి ఆవరణలో జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్ జోసఫ్ రాజ్ కెన్నెడి, ఆయన సతీమణి యోజనరెడ్డిలు క్రీస్తు సందేశాన్ని అందించారు. అనంతరం ఏసు క్రీస్తుపాటల బృంద గానం ఆకట్టుకుంది. సంఘ సేవకులు కరుణాకర్, తీగుళ్ల కల్యాణ్ చక్రవర్తి గౌడ్, ఎడ్వర్డ్ శామ్యుల్, శ్యామ్‌సన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్లకు హాస్టల్ విధులు వద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో గురుకుల టీచర్లను హాస్టల్ విధుల నుంచి వేరు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారీ అశోక్‌కుమార్ యాదవ్ సోమవారం డిమాండ్ చేశారు. పాఠాలు చెప్పే టీచర్లకు హాస్టల్ విధులు అప్పగించడం వలన సరిగా బోధించలేక పోతున్నారన్నారు. బోధనతో పాటు ఏక కాలంలో హాస్టల్ పనులు, రాత్రి విధులు, భోజనశాలలు, వంటల పర్యవేక్షణతో పాటు విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ విషయాన్ని పూర్తిగా అధ్యయనం చేసి పాఠశాల టీచర్లకు హాస్టల్ విధులను తొలగించాలని అధికారులను కోరారు.

కించపరిచే మాటలు మానుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ మాలలను కించపరిచే మాటలు మానుకోవాలని భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల భాస్కర్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షులు అంగిరి ప్రదీప్ హెచ్చరించారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితలు, కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అవార్డును ప్రకటిస్తే మందకృష్ణమాదిగ వారికి కులాన్ని అంటగట్టడం దారుణమన్నారు. ఈ నెల 27న లక్ష డప్పులతో మాలలకు చావుడప్పు కొడతామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాలలకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తామని ప్రకటించడం అవివేకమన్నారు. కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదన్నారు.కార్యక్రమంలో మాల విద్యార్థి నాయకులు మాదాసు రాహుల్, పండుగ భానుతేజ, ప్రదీప్, మల్లికార్జున్, యశ్వంత్, అభిషేక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పరీక్షల ఫీజును తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఇంజినీరింగ్ పరీక్షల ఫీజును తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. సోమవారం క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్ కార్యాలయంలో కంట్రోలర్ ఆఫీస్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు పరీక్ష ఫీజుతో పాటు ప్రతి పేపర్‌కు రూ.1000 ఫీజును వసూలు చేయడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రీవాల్యుయేషన్ ఫలితాలు వెలువడక ముందే పరీక్షల ఫీజు చెల్లించే తేదీలను ప్రకటించడం వలన విద్యార్థులు రెండు విధాలుగా నష్టపోతారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన ఫలితాలను ప్రకటించిన అనంతరమే ఫీజు చెల్లించే గడువును పొడించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మణి, దినేష్, అనుష్, నవీన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై వేధింపులు ఆపాలి



అఖిల్‌కు వినతిపత్రం ఇస్తున్న వీధి వ్యాపారులు

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్‌కు అవాంతరాలు కలిగిస్తున్నారంటూ ట్రాఫిక్ పోలీసులు వీధి వ్యాపారులను వేధిస్తున్నారని ఆల్ ఇండియా నేషనల్ హాకర్స్ ఫెడరేషన్ యూత్ కార్యదర్శి అఖిల్ మండలం కోరారు. సోమవారం పీజీరోడ్‌లో వీధి వ్యాపారులు ఆయనను కలిసి పోలీసులు వేధింపుల గురించి విన్నవించారు. ఫుట్‌పాత్ పై వ్యాపారాలు చేస్తూ వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, పోలీసులు వారిని తొలగిస్తుండటంతో రోడ్డుపై పడుతున్నారని అన్నారు. ఒకే సారి ఇలా అందరినీ అక్కడి నుంచి తొలగిస్తే వారు ఎక్కడ వ్యాపారాలు చేసుకుంటారని ప్రశ్నించారు.

ఓయూలో ఫైల్స్ చూడనున్న ఓఎస్‌డీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) వోఎస్‌డీకి ఫైల్స్ చూసే బాధ్యతలను వీసీ ప్రొ.కుమార్ అప్పగించారు. ఓఎస్‌డీ అంటే కేవలం వీసీ కార్యక్రమాలను పర్యవేక్షించాలి. కానీ గతంలో లేని విధంగా ఫైల్స్‌ను పరిశీలించి సంతకాలు చేయడం యూనివర్సిటీ నిబంధనల్లో లేదని ఓయూ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో ప్రతి ఫైల్ రిజిస్ట్రార్, వీసీ మాత్రమే చూసి సంతకాలు చేసేవారని, ప్రొ.కుమార్ వీసీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఓఎస్‌డీకి ఫైల్స్ చూసే బాధ్యతలను అప్పగించారని తెలిపారు. ఇప్పుడు ఓఎస్‌డీ చూసిన తర్వాత రిజిస్ట్రార్‌కు, రిజిస్ట్రార్ నుంచి వీసీ చూసి సంతకాలు చేసే వరకు తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని వీసీ ప్రొ.కుమార్ గ్రహించాలని ఓయూ అధికార వర్గాలు కోరుతున్నారు.

గుండెపోటుతో ఇన్‌స్పెక్టర్ మృతి



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు

అమీర్‌పేట: గుండె పోటుతో ఇన్‌స్పెక్టర్ మృతి చెందాడు. అమీర్‌పేట సోనాబాయమ్మ దేవాలయం వెనకాల ఓ అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో ఇన్‌స్పెక్టర్ అరిమెల్లి శ్రీనివాస్ (55) భార్యతో కలిసి ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున గుండెలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలపడంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. 1995 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా కూడా పనిచేశారు. ఎక్కువ కాలం ఎస్‌బీ విభాగంలో పని చేసి నారాయణగూడ, రాంగోపాల్‌పేట, హిమాయత్‌నగర్ స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్‌గాను శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఇమ్మిగ్రేషన్‌లో చేసి ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాస్ స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు.

ఓటీఎస్..పూర్ రెస్పాన్స్

నల్లా బకాయిలు చెల్లించని వారిపై చర్యలు?

- ఓటీఎస్‌కు స్పందన అంతంత మాత్రమే!
- వడ్డీ మాఫీ చేసినా ముందుకురాని బకాయిదారులు
- 20 నుంచి ముమ్మర చర్యలకు ఆదేశాలు



సికింద్రాబాద్‌లోని జలమండలి కార్యాలయం

సికింద్రాబాద్: నల్లా బిల్లులు పేరుకుపోయవడంతో వినియోగదారులకు జలమండలి అధికారులు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశం ఇచ్చారు. అయినా ప్రజల నుంచి స్పందన అంతంతే రావడం.. గడువు ముగియడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

- జలమండలి మారేడుపల్లి డివిజన్ (07) పరిధిలో బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జలమండలి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.
- ఈనెల 20 నుంచి రెడ్ నోటీసులు జారీ చేయడం, ఆపై నల్లా కనెక్షన్‌ను రద్దు చేయడం వంటి చర్యలకు డివిజన్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు.
- మారేడు పల్లి డివిజన్ పరిధిలో ధీర్ఘ కాలంగా పేరుకు పోయిన నల్లా బిల్లుల బకాయిలు రూ. కోట్లకు చేరుకున్నాయి. ఈ ఏడాది అక్టోబరులో ఓటీఎస్‌ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.
- వడ్డీ మాఫీకి అవకాశం ఇచ్చినా బకాయిదారుల నుంచి నామమాత్రపు స్పందన మాత్రమే వచ్చింది. ఈ అవకాశాన్ని మరో నెల (నవంబర్ 30 వరకు) పొడిగించినప్పటికీ అధికారులకు నిరాశే ఎదురైంది.

ఓటీఎస్ వసూళ్ల తీరిదీ!

ఓటీఎస్‌ను వినియోగించుకుని బకాయి బిల్లులను కేవలం 12.5 శాతం మంది మాత్రమే మొత్తంగా చెల్లించారు. మరో 7.5 శాతం మంది మొత్తం బకాయిల్లో పాక్షికంగా చెల్లించారు.

- డివిజన్ పరిధిలోని 12 సెక్షన్ కార్యాలయాల పరిధిలో మొత్తంగా బకాయిపడిన కనెక్షన్‌దారులు 37,636 మంది ఉన్నారు. వీరందరి ద్వారా జలమండలి అధికారులకు రూ. 19.5 కోట్ల బకాయిలు (ప్రభుత్వ కార్యాలయాలు మినహా) వసూలు కావాల్సింది.
- ఇందులో 3,778 మంది పూర్తిగా, 1118 మంది పాక్షికంగా బకాయిలు చెల్లించారు. ఓటీఎస్ ద్వారా మొత్తంగా రూ.3.69 కోట్లను జలమండలి అధికారులు రాబట్టగలిగారు. వాస్తవంగా రావాల్సిన బకాయిలు రూ. 20 కోట్లు. వన్ టైమ్ సెటిల్మెంట్ పట్ల బకాయిదారులు ఎంతమాత్రం ఆసక్తి చూపకపోవడం పట్ల జలమండలి అధికారులు విస్మయానికి గురయ్యారు.

ప్రచారలేమితో స్పందన కరవు...

జలమండలి అధికారులు గతంలో ఓటీఎస్ అమలు చేసిన సందర్భాల్లో విస్తృతంగా ప్రచారాలు చేసేవారు. సిబ్బంది ఇంటింటి ప్రచారం చేయడంతో పాటు, ఆటోలకు బ్యానర్లు మైకులు బిగించి ప్రచారాలు చేసేవారు.

- ఆ సమయంలో ఆశించిన మేర వసూళ్లు జరిగాయి. తాజాగా ఎటువంటి ప్రచారాలు జరుగకపోగా బకాయిదారుల్లో ఎక్కువ మందికి కనీసం ఓటీఎస్ గురించి ఫోన్ నెంబర్లకు సమాచారమే రాలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.
- ఇదిలా ఉండగా ఉచిత నీటి అర్హతకు ఆధార్ లింకు చేసుకోని వారు సైతం పాత బకాయిలు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. గత నెల 30వ తేదీతో ఓటీఎస్ గడువు ముగిసిపోయిన నేపథ్యంలో ఇప్పుడు బకాయిలు చెల్లించే వారికి వడ్డీ రాయితీలు వర్తించే అవకాశం లేదు.

యెగ్గె మల్లేశం వ్యాఖ్యలు సరికాదు

సనత్‌నగర్: ఇటీవల జరిగిన దొడ్డి కొమురయ్య ఆత్మ గౌరవ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం యాదవులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు యాదవుల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నాయని బేగంపేట యాదవ సంఘం అధ్యక్షులు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పొన్నబోయిన సురేష్‌యాదవ్ అన్నారు. యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, కోశాధికారి సత్యనారాయణయాదవ్ తదితరులతో కలిసి సోమవారం బేగంపేటలోని యాదవ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలని డిమాండ్ చేయడం తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే యాదవులతో తాము నెగ్గలేమని అనడం సరికాదన్నారు. ఒకే సామాజిక గొడుగు కిందకు వచ్చే యాదవులు, కరుమలు కలిసిమెలిసి ఉంటున్నారని, వీరి మధ్య చిచ్చుపెట్టేలా యెగ్గె మల్లేశం వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. పరోపకారం, సేవాగుణం యాదవుల లక్షణమని, వారిని బెదిరించే వారిగా మల్లేశం మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణం యెగ్గె మల్లేశం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: గౌరీ శంకర్ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఏబీవీపీ సీనియర్ నాయకులు డా.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో జరిగే 43వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని జనమంచి గౌరీశంకర్ యువ పురస్కారాలను అందచేయనున్నట్లు తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమాలు చేసే యువకులు అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. వివరాలకు 9490866833 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఘనంగా డిఫెన్స్ ఎస్టేట్స్ డే వేడుకలు



డిఫెన్స్ ఎస్టేట్స్ డే వేడుకల్లో జాయింట్ సీఈఓ పల్లవి, బోర్డు ఉద్యోగులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో 'డిఫెన్స్ ఎస్టేట్స్ డే' ఘనంగా నిర్వహించారు. కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ పల్లవి విజయ్‌వర్షినీ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బోర్డు ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. జాయింట్ సీఈఓ తొలుత ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం డిఫెన్స్ ఎస్టేట్స్ డే ను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ చీఫ్ ఇంజనీర్ ఉమాశంకర్, సూపరింటెండెంట్‌లు, యానీ, రమణ, గుప్తా, తాజ్‌మల్ అక్బర్, ఇంజనీర్‌లు దినేశ్, తరుణ్, కృష్ణకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. వారాసిగూడ విశాల్‌మార్ట్ ఎదురుగా మురుగు నీరు పొంగి ప్రవహిస్తోందని స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఎయిర్‌టెక్ మిషన్‌తో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ శుభ్రం చేయించారు. నూతన పైప్‌లైన్ల ఏర్పాటుతో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. జలమండలి మేనేజర్ కుషాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అన్నానగర్ చౌరస్తాలో అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

రసూల్‌పురా: అన్నానగర్ అయ్యప్ప సేవ సమాజం ఆధ్వర్యంలో అన్ననగర్ చౌరస్తాలోని పోచమ్మ ఆలయం ఆవరణలో అయ్యప్ప స్వామి 35వ పడిపూజ కార్యక్రమం సోమవారం జరిగింది. అయ్యప్ప కీర్తనలు, భజనలతో పరిసరాలు మార్మోగాయి. గురుస్వాములు మద్దెల యాదగిరి, వెంకటేష్, సాగర్, శ్రీశైలం, మహేందర్ నేతృత్వంలో జరిగిన ఈ పడిపూజలో వందలాది మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. ఈ పడిపూజ కార్యక్రమానికి బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, రాష్ట్ర బెవరేజీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్, బీజేపీ నాయకులు బీఎన్ శ్రీనివాస్, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి గోపాల్ తదితరులు హాజరయ్యారు.

పాలక మండలి సభ్యులను నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో పాలక మండలి (ఈసీ) సభ్యులను నియమించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పాలక మండలి పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా ఇంత వరకు సభ్యులను నియమించక పోవడం విచారకరమన్నారు. ప్రతి వర్సిటీకి అధ్యాపకులు, ప్రిన్సిపల్స్, విద్యార్థి నేతలను కలిపి 12 మంది సభ్యులను పాలక మండలికి ఎంపిక చేస్తారని, ప్రస్తుతం కేవలం నలుగురు ప్రభుత్వ అధికారులతోనే పాలక మండలి కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్



లాలాపేట: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇలంబర్తిని సోమవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఇతర పాలనా పరమైన అంశాలపై వారు ఇరువురు కొంత సేపు చర్చించుకున్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభించిన వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో కొత్తగా నిర్మించిన బయోగ్యాస్ ప్లాంట్‌ను వీసీ ప్రొ.కుమార్ సోమవారం ప్రారంభించారు. కేపీఎంజీ, అహూజా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు సీఎస్ఆర్ కింద అందించిన కోటి రూపాయలతో సాహస్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు వీసీ వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొ.జితేంద్రనాయక్, బయోడైవర్సిటీ సెంటర్ డైరెక్టర్ ప్రొ.శ్రీనివాసులు, చీఫ్ ప్రొ.వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్ రావు, లేడీస్ హాస్టల్ డైరెక్టర్ ప్రొ. కళ్యాణ లక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో సీలింగ్ తొలగించండి

- పార్లమెంటులో ఎంపీ ఈటల



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చేపట్టే కారుణ్య నియామకాల్లో 5 శాతం సీలింగ్‌ను తొలగించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రక్షణ మంత్రిని కోరారు. ఈ మేరకు సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశాల జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నాలుగో తరగతి ఉద్యోగులు ముఖ్యంగా సఫాయి కర్మచారీలు అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పలువురు ఉద్యోగులు విధుల్లో ఉండగానే మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆయా కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అయితే బాధిత కుటుంబాలకు చెందిన వ్యక్తులకు ఉద్యోగం ఇచ్చేందుకు 5శాతం సీలింగ్ ప్రతిబంధకంగా మారిందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించిన పనిచేసిన కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వ్యక్తులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం కల్పించాలని కోరారు. మానవతా దృక్పథంత 5శాతం సీలింగ్‌ను సవరించి అర్హులైన వారందరికీ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

వరద సమస్యను పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే తలసాని



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: వరద ముప్పు నుండి గాయత్రీనగర్ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపించనున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారంకాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో నాలా పొంగి ముంపునకు గురవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని రూ.1.5 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో అధికారులతో కలిసి కాలనీలో పర్యటించినట్లు తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటనారాయణ, వాసుదేవరెడ్డి, సందీప్, సయ్యద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకుస్థానికంగా ఉన్న చెత్తను అధికారులు సిబ్బందితో తొలగించారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



సీతాఫల్‌మండిలో ధర్నా నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

చిలకలగూడ: ఆటోడ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఆటోయూనియన్ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ప్లకార్డులు ప్రదర్శించి ధర్నా నిర్వహించారు. ఆటోయూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఆటోరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గత కొన్నేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు సరైనరీతిలో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉబర్, ఓలా, రాపిడోలతోపాటు ఇతర జిల్లాల ఆటోలను హైదరాబాద్‌లో నిషేధించాలని, సమస్యలను పరిష్కరించి ఆటోకార్మికరంగ సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల ధర్నాకు సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు శంకర్‌యాదవ్, వేణు, కొమురెల్లి బాబు, మధుకర్, నరసింహా పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళి

రసూల్‌పురా: బంగ్లాదేశ్ విముక్తిలో భాగంగా 1971లో ఇండో పాకిస్తాన్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారతదేశం చారిత్రాత్మక విజయానికి గుర్తుగా నిర్వహించే విజయ్ దివస్ ఘనంగా నిర్వహిస్తూ అమరులైన సైనికులకు నివాళులర్పిస్తున్నారు. సోమవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో సైనిక దళాల ధైర్యసాహసాలకు గుర్తుగా ఆర్మీ ఆధ్వర్యంలో 53వ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించి వీరుల సైనికుల యుద్ధ స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఎయిర్ వైస్ మార్షల్, కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్ కాలేజ్ కమాండెంట్ పీఎస్, వడోద్కర్, ఆర్మీ, నేవీ ఉన్నతాధి కారులు ముఖ్య అతితిగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ విద్యార్థులు, సైనికులు, వివిధ సాయుధదళాలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..)టమాటా.15, నల్లవంకాయ 25 పొడుగు వంకాయ 19, బెండకాయ 45, పచ్చిమిర్చి 25, బజ్జీమిర్చి 18, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 38, పందిరి బీర 60, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 40, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 48, గోకరకాయ 28, కీర 35, దోసకాయ 18, బీట్‌రూట్ 33, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 28, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మురుగు సమస్య తీరేదెప్పుడు?

- హాస్టళ్ల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- రోడ్లపై పొంగిపొర్లుతున్న మురుగు

అమీర్‌పేట: వ్యాపార, వాణిజ్య శిక్షణా సంస్థలకు నిలయంగా పేరొందిన అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్‌లో రోజు రోజుకు జనాభా పెరుగుతోంది. దీనికి తోడు ప్రైవేటు హాస్టళ్లు కూడా పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్థానికంగా మంచినీటి సమస్య ఏర్పడటంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. జనాభాకు అనుగుణంగా ఎప్పటికప్పుడు డ్రైనేజీ పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచుతున్నా లీకేజీల పరంపర కొనసాగుతోంది. విచ్చల విడిగా ప్రైవేటు హాస్టల్స్ పుట్టుకొస్తుండటం, వ్యర్థాలను డ్రైనేజీ పైప్‌లైన్లలోకి వదులుతుండటంతో తరుచూ డ్రైనేజీ సమస్యలు ఏర్పడుతున్నాయని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేటలో అధికారికంగా సుమారు 1500 వరకు హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో వేల సంఖ్యలో నివాసముంటున్నారు. వ్యర్థాలను డ్రైనేజీ పైప్‌లైన్‌లలో పారవేస్తున్నందున పైప్‌లైన్‌లు ఎక్కడికక్కడ జాం అవుతున్నాయి. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని అధికారులు గుర్తించారు. అయితే హాస్టల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా సిల్ట్ చాంబర్స్‌ను ఏర్పాటు చేసుకుంటే వదేసిన వ్యర్థాలు డ్రైనేజీ పైప్‌లైన్‌లో కలువకుండా ఉంటాయని, విలువైన వస్తువులు డ్రైన్‌లో పడిపోయినా సిల్ట్ చాంబర్‌లోనే నిలిచిపోయే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే జలమండలి అధికారుల సూచనలను పెడచెవిన పెడుతున్నారు. సిల్ట్ చాంబర్లపై దృష్టి సారించి అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని మురుగు సమస్యను పరిష్కరించి ఇష్టారాజ్యంగా వ్యవహరించే హాస్టళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.